497) దేవగాంధారి

ప॥ అడ్డము చెప్పగరాదు అవుగాదనగరాదు। వొడ్డిన దనుభవించే దోపిక జీవులది॥

చ॥ యీరికలెత్తి జన్మము లిన్ని జంతువులయందు। కోరికలు గొనసాగె గోటానగోటి।
నారుకొనె సంపదలు నానారూపములై। తీరదేమిటా నీచిక్కు దేవుడు వెట్టినది॥

చ॥ అల్లుకొని గర్మములు అక్కడికి నిక్కడికి। వెల్లవిరాయని మాయ వెనకా ముందు।
కెల్లురేగె దేహమందే కిమ్ముల చుట్టరికాలు। పొల్లువో దెన్నడు భూమి పుట్టగా బుట్టినది॥

చ॥ పండెను సంసారము ఫలమైననాటికి। నిండెను నాలికకు నెమ్మది జవులు।
అండనే శ్రీవేంకటేశు డంతర్యామై వుండి। పండ వండనట్లుగ వన్నెకెక్కించినది॥